నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, మంగళవారం 4 ఫిబ్రవరి 2025 | MEDAK

## ఎన్నికల కోడ్ పేరుతో పథకాలు ఆపేందుకు కుట్ర

- పథకాలను పెండింగ్ పెట్టడమే పనిగా పెట్టుకున్న సర్కారు
- రైతుభరోసా అందించాలి
- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

కంది, ఫిబ్రవరి 3: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల కోడ్ పేరుతో ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలను ఆపేందుకు కుట్ర చేస్తుందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. పెండింగ్, ఫాడింగ్ చేయడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. సోమవారం సంగారెడ్డి క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం సంగారెడ్డి, సదాశివపేట పట్టణాల అభివృద్ధికి ఎస్డీఎఫ్ నిధుల ద్వారా సంగారెడ్డి మున్సిపాలిటీకి రూ.50కోట్లు, సదాశివపేట మున్సిపాలిటీకి రూ.25 కోట్లు ముంజూరు చేసిందన్నారు. కానీ ప్రభుత్వం మారడంతో సంగారెడ్డి పట్టణంలో 53, సదాశివపేటలో 141 పెండింగ్ పనులకు సంబంధించిన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేసిందని మండిపడ్డారు. పట్టణాల అభివృద్ధిని అడ్డుకోకుండా రద్దు చేసిన పనులను ప్రారంభించాలని ఆయన డిమాండ్ చేశారు. జనవరి 26 తర్వాత రైతు భరోసా డబ్బులు ఖాతాల్లో వేస్తామని మరోసారి మోసం చేసిందని, ఇప్పటి వరకు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదన్నారు. నాలుగు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పడం తప్పా చేసిందేమీ లేదన్నారు. సంగారెడ్డి నియోజకవర్గంలో 86 గ్రామాలుంటే కేవలం నాలుగు గ్రామాలను ఎంపిక చేసి అమలు చేయని పరిస్థితుల్లో కాంగ్రెస్ పాలన ఉందన్నారు. కాంగ్రెస్ పాలనలో రైతులు అయోమయంగా ఉన్నారని, పంట రుణమాఫీపై స్పష్టత లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పూర్తిస్థాయిలో పంట రుణమాఫీ అయ్యిందని ప్రకటనలు చేస్తుంటే, జిల్లా మంత్రి పూర్తిస్థాయిలో పంట రుణమాఫీ కాలేదని ఒప్పుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం మాని అభివృద్ధిపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు వెంకటేశ్వర్లు, మధుసూదన్‌రెడ్డి, చక్రపాణి, ఆంజనేయులు, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

కొమురవెల్లి, ఫిబ్రవరి 3: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను సోమవారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండల బీఆర్ఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం కరీంనగర్‌కు వెళ్తున్న ఎమ్మెల్సీ కవితను కొమురవెల్లి కమాన్ వద్ద బీఆర్ఎస్ నాయకులు కలిసి మల్లికార్జున స్వామి కండువా కప్పి ప్రసాదంతో పాటు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత ఒక్కొక్కరిని ఆప్యాయంగా పలుకరించారు. అనంతరం మాజీ జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప కుమారుడు అజయ్‌కుమార్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సార్ల కిష్టయ్య, ముత్యం నర్సింహులు గౌడ్, గొల్లపల్లి కిష్టయ్య, కొమురవెల్లి మాజీ ఉపసర్పంచ్ కొండ శ్రీధర్, ఏర్పుల మహేశ్, గొల్లపల్లి ఆంజనేయులు, బుడిగె రమేశ్ గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షుడు సిలివేరు కనకమల్లేశం, బుడిగె గిరికుమార్, విరాట్‌బాబు తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్సీ కవితకు మల్లికార్జున స్వామివారి ఫొటో అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# సర్వేపై భగ్గుమంటున్న బీసీలు

- ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయని రేవంత్ సర్కార్
- హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల మండిపాటు
- కులగణన జాబితాను పూర్తిస్థాయిలో విడుదల చేయాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడానికి అడ్డదారులు తొక్కుతున్న ప్రభుత్వం
- స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్

## కులగణన పూర్తి చేయకుండానే చేశామంటూ ప్రభుత్వం గొప్పలు


మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలంలోని గజగట్లపల్లిలో కులగణన సర్వే చేపడుతున్న పంచాయతీ కార్యదర్శి (ఫైల్)

సిద్దిపేట, ఫిబ్రవరి 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి): ఉమ్మడి మెదక్ జిల్లాలో సమగ్ర కుల గణన పూర్తి చేయకుండానే పూర్తి చేశామని అధికార కాంగ్రెస్ సర్కార్ చేతులు దులుపుకుంటుందని బీసీ సంఘాల నేతలు, బీసీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేశామని చెప్పుకుంటున్న ఇంటింటి సమగ్ర సర్వేపై మండి పడుతున్నాయి. సర్వేలో మీరు అడిగింది ఏంటి ..? చేసింది.. ఏంటి ...? ఎక్కడ సర్వే పూర్తి చేశారంటూ ప్రభుత్వంపై బీసీ సంఘాలు, నాయకులు, ప్రజలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎక్కడ కూడా 50శాతం సర్వే పూర్తి కాలేదని ఆ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. నిజంగా జిల్లాల వారీగా పూర్తి సమగ్ర కుల గణన పూర్తయితే, ఎందుకు జాబితాను పూర్తి స్థాయిలో విడుదల చేయడం లేదని ఆ సంఘాల నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. యాభై శాతం వరకు సర్వే పూర్తి చేసి, దానిని వందశాతం పూర్తి అయిందని అనడం ఎంతవరకు సబబు అని ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నారు. వివిధ రంగాల్లో ఉన్నవారి స్థితిగతులు అంచనా వేయడానికి దోహదపడాలి కానీ, ప్రభుత్వం చేసిన సర్వే అప్పులు, ఆస్తులు ఇతర అంశాలు అడిగారని ఆ వర్గాలు ఆరోపిస్తున్నాయి. సామన్య ప్రజల ఆస్తులు అడిగారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ అనేక హామీలు ఇచ్చింది. బీసీ వర్గాలకు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటి కూడా అమలు చేయడం లేదని మండిపడుతున్నారు. సమగ్ర కుల గణన సర్వే పూర్తిస్థాయిలో చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ వర్గాలకు 42శాతం కోటా ఇవ్వాలని వారు డిమాండ్ చేస్తున్నారు. అధికార కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడానికి అడ్డదారులు తొక్కుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేసేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని బీసీ సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. సమగ్ర కుల గణన పూర్తిస్థాయిలో చేయాలని ఆ వర్గాలు ప్రజలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

### న్యాయపరమైన రిజర్వేషన్ అమలు చేయాలి

గజ్వేల్, ఫిబ్రవరి 3: న్యాయపరంగా అమలు చేయాల్సిన రిజర్వేషన్లను ప్రభుత్వం బీసీలకు వెంటనే అమలు చేయాలి. 42శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. సబ్ కమిటీ ప్రకటించిన కుల గణన నివేదిక తప్పులతడక. వందశాతం కుల గణన చేశామనడం తప్పు. ఏ గ్రామంలో పూర్తిస్థాయిలో సర్వే చేపట్ట లేదు. కుల గణన సర్వేలో అన్ని రకాల వివరాలు అడగడంతో చాలామంది సర్వేకు ముందుకు రాలేదు. వందశాతం సర్వే పూర్తి కాకుండానే వివరాలు ప్రకటించారు. ప్రభుత్వం మరోసారి సమయం తీసుకొని సర్వేలో పాల్గొనని వారి వివరాలు తీసుకునేలా సర్వే చేపట్టాలి. అప్పుడే బీసీ కులాల శాతం ఎంత ఉందో బయటపడుతుంది. తప్పుల వివరాలను బహిర్గతం చేయడంతో అన్ని వర్గాల వారికి అన్యాయం జరిగే ప్రమాదం ఉంది.

*– మాదాసు శ్రీనివాస్, మాజీ ఏఎంసీ చైర్మన్, గజ్వేల్*

### బీసీ గణన సంతృప్తిగా లేదు...

గుమ్మడిదల, ఫిబ్రవరి 3: రాష్ట్రంలో గతేడాది నవంబర్‌లో ప్రభుత్వం ఇంటింటి సర్వే చేసి ఇప్పుడు బీసీలు 46శాతమే అని తెల్చడం సరైనది కాదు. ఇందులో ముస్లిం బీసీలు కలిపితే 56శాతమని, ఇంకా 16 లక్షల మంది వివరాలు సేకరించలేకపోయామని చెప్పడం వల్ల బీసీలకు అన్యాయం జరిగినట్లే. వందశాతం కులగణన చేసినప్పుడే గణన జరిగినట్లు. ఈ కులగణనతోనే స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ వస్తుంది. ఈ తప్పుడు లెక్కల వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుంది. ఎంతో గొప్పగా కులగణన చేస్తామని గొప్పలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం కులగణనలో విఫలమైనది. పూర్తిస్థాయిలో బీసీ కులగణన చేయాలి. రాష్ట్రంలో 60శాతం బీసీలు ఉన్నారన్న విషయాన్ని ప్రభుత్వం గమనించాలి.

*– మంగయ్య, బీసీ నాయకుడు, దోమడుగు, గుమ్మడిదల మండలం*

### తప్పుల తడఖాగా బీసీ కులగణన

గుమ్మడిదల, ఫిబ్రవరి 3: బీసీ కుల గణన చేస్తామని గొప్పలు చెప్పిన రేవంత్‌రెడ్డి సర్కారు, ఇప్పుడు బీసీ కులగణన పూర్తిస్థాయిలో చేయకపోవడం విడ్డూరంగా ఉంది. గతంలో బీఆర్ఎస్ ఒక్క రోజులో జనాభ గణన చేసి రికార్డు సృష్టించింది. ఆ ఘనత అప్పటి సీఎం కేసీఆర్ సర్కారుకే దక్కింది. కానీ కాంగ్రెస్ సర్కారు నవంబర్‌లో ప్రజాపాలన పేరుతో బీసీ కులగణన చేపట్టి మూడు నెలల అయినప్పటికీ పూర్తిస్థాయిలో బీసీ కులగణన చేయకపోవడం కాంగ్రెస్ పాలన వైఫల్యానికి నిదర్శనం. గొప్పలు చెప్పడం కాదు.. చెప్పినది చేయాలనే లక్ష్యం కాంగ్రెస్ సర్కారుకు లేదని బీసీ కులస్తులు ఆరోపిస్తున్నారు. బీసీలకు అన్యాయం జరగకుండా పూర్తి స్థాయిలో కులగణన చేయాలి.

*– మురళి, అన్నారం, మాజీ సర్పంచ్, గుమ్మడిదల మున్సిపాలిటీ*

## సేవాతత్పరతను అలవార్చుకోవాలి

గుండె ఆపరేషన్ చేసుకున్న చిన్నారిని పలుకరిస్తున్న సినీ నటుడు సుమన్

- సంజీవని దవాఖాన సేవలు అద్భుతం
- ప్రముఖ సినీ నటుడు సుమన్

కొండాపాక(కుకునూరుపల్లి), ఫిబ్రవరి 3: సత్యసాయి సేవా సంస్థలు అందిస్తున్న సేవలు మహోన్నతమైనవని, సాయి స్ఫూర్తితో సేవా తత్పరతను అలవార్చుకోవాలని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నాడు. సిద్దిపేట జిల్లా కొండాపాక శివారులో ఏర్పాటైన సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ హార్ట్ కేర్ రీసెర్చ్ సెంటర్‌ను సోమవారం సుమన్ సందర్శించాడు. దవాఖానలో ఆపరేషన్ల తీరును పరిశీలించడంతోపాటు ఆపరేషన్లు చేయించుకున్న చిన్నారులను పలకరించాడు. గుండె ఆపరేషన్లు చేయించుకున్న నలుగురు చిన్నారులకు మెమోంటోలు అందజేశాడు. అనంతరం మాట్లాడుతూ.. సత్యసాయి దవాఖాన పిల్లల పాలిట సంజీవనిగా నిలిచిందన్నారు. సత్యసాయి సంజీవని సెంటర్ ఫర్ హార్ట్ కేర్ రీసెర్చ్ సెంటర్ అభివృద్ధి చెందుతూ ప్రపంచస్థాయిలో ఆదర్శంగా నిలిచిందన్నారు. పిల్లల ఆపరేషన్లు చేయడం కష్టతరమైన పని అని, అటువంటి సర్జరీలు చేస్తున్న వైద్యులను అభినందించాడు. దేశంలో సత్యసాయి దవాఖానల్లో సుమారు 34 వేల గుండె ఆపరేషన్లు చేయడం గొప్ప విషయమన్నారు. ఇక్కడ దవాఖాన ఏర్పాటు కావడం ఈ ప్రాంత ప్రజల అదృష్టం అన్నారు. కార్యక్రమంలో రిటైర్డు ఐఏఎస్ అధికారి చక్రపాణి, దవాఖాన చైర్మన్ శ్రీనివాస్, డాక్టర్ రాగిని, డాక్టర్ స్వప్న, దుర్గ వడ్లమూడి, జగన్నాథ శర్మ, గణేశ్ పాల్గొన్నారు.

## బహుజనులు చైతన్యవంతులుగా ఉండాలి

- బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ


తెల్లాపూర్‌లో వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

రామచంద్రాపురం, ఫిబ్రవరి 3: బహుజనులందరూ చైతన్యవంతులుగా ఉండి, హక్కుల కోసం పోరాడాలని బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్‌లో ఏర్పాటు చేసిన వడ్డె ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జెరిపెటి జైపాల్‌తో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై ఓబన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. విద్యలేనిదే విజ్ఞానం లేదు, నైతికత లేదు, అభివృద్ధి లేదు, సంపద లేదు... అందుకే బహుజనులందరూ బానిసలైండ్రని ఆనాడే మహనీయుడు జ్యోతిరావుపూలే అన్నారని గుర్తుచేశారు. మహిళలకు చదువు అవసరమా అనుకునే రోజుల్లో.. సావిత్రీబాయి చదువుకొని తోటి మహిళలకు ఆదర్శంగా నిలిచారని తెలిపారు. చదువుతోనే సమాజంలో బహుజనులు బాగుపడుతారని, ప్రతిఒక్కరికీ విద్య అవసరం అన్నారు. ఎన్నో బస్తీల్లో పిల్లలు చదువుకు దూరమై కూలీలుగా బతుకుతున్నారని, ఆ పరిస్థితి మారాలన్నారు. బహుజనులందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కావాలని డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం రచించి మనకు ఇచ్చారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. వడ్డెరలు నేటికీ అట్టడుగు స్థాయిలో ఉన్నారని, వారిలోనూ చైతన్యం రావాలన్నారు. వడ్డె ఓబన్న చరిత్రను కనుమరుగు చేశారని, ఆయన చరిత్ర అందరికీ తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెల్లాపూర్‌లో కొల్లూరి సత్తయ్య, కొల్లూరి భరత్ ఆస్క్ ఎడ్యుకేషన్ సొసైటీని ఏర్పాటు చేసి బహుజనులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడం అభినందనీయమని తెలిపారు. ఇక్కడ విగ్రహాలతో పాటు విజ్ఞాన కేంద్రాల ఏర్పాటు కూడా అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ పసునూరి రవీందర్, నాయకులు సోమిరెడ్డి, వడ్డె నర్సింహులు, వడ్డె లింగయ్య, కుమార్ గౌడ్, కొల్లూరి సత్తయ్య, భరత్, లచ్చిరామ్, నాగరాజు, సాగర్, ఉమేశ్, శ్రీకాంత్‌రెడ్డి, జనార్దన్, వడ్డె సత్తిబాబు, వడ్డెర సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 472 గ్రామాల ఎదురుచూపు!

- మొత్తం 4,06,643 ఎకరాల్లో.. 3,99,774 ఎకరాలకే భరోసా
- 6,869 ఎరాలకు రైతు భరోసా లేనట్టే..?

### మెదక్ జిల్లాలో 21 గ్రామాలకే రైతు భరోసా

మెదక్, ఫిబ్రవరి 3 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో రైతు భరోసా సాయం కోసం 472 గ్రామాలు ఎదురుచూస్తున్నాయి. జిల్లాలో మొత్తం 4,06,643 ఎకరాల భూములు ఉండగా, ఇందులో 3,99,774 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా ఇస్తామని, మిగతా 6,869 ఎకరాలు సాగుకు యోగ్యం కావని అధికారులు తెలుపడంతో ఆ భూములకు రైతు భరోసా ఇవ్వడం కుదరదని అధికారులు చెబుతున్నారు. 21 మండలాల్లోని 493 గ్రామాలు ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గుంట భూమి ఉన్నా రైతుబంధు పథకం కింద పెట్టుబడి సాయం అందజేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ సభలు నిర్వహించి రైతుల అభిప్రాయాలు సేకరించింది. దీంతో రైతులు పెట్టుబడికి రైతు భరోసా కింద సాయం అందుతుందని ఆశ పడ్డారు. కానీ రైతుల ఆశలన్నీ నిరాశలయ్యాయి. గణతంత్ర దినోత్సవం సందర్భంగా నూతనంగా ప్రవేశపెట్టిన నాలుగు సంక్షేమ పథకాలను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఇందులో రైతు భరోసా సాయం కింద మండలానికి ఒక గ్రామం చొప్పున 21 గ్రామాల్లో మాత్రమే పథకాలను ప్రారంభించారు. 21 గ్రామాల్లో 14,819 మంది రైతులకు రూ.14.52 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేశారు.

#### మిగతా గ్రామాలకు పడేనా?

మెదక్ జిల్లాలో 493 గ్రామాలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకం కింద కేవలం 21 గ్రామాల్లోనే రైతు భరోసా కింద రైతులకు పెట్టుబడి సాయాన్ని అందించారు. మిగతా 472 గ్రామాల రైతులు ఎదురుచూస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు పథకం కింద అర్హులైన ప్రతి రైతుకూ పెట్టుబడి సాయం అందజేసింది. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.2 లక్షల పంట రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటి వరకు పూర్తి చేయలేదని రైతులు వాపోతున్నారు. రైతు భరోసా కూడా తమకు వస్తుందో లేదోనని రైతులు ఆవేదన చెందుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కొండలు, గుట్టలు, రియల్ ఎస్టేట్ వెంచర్లలో ఉన్న ప్లాట్లకు సైతం రైతుబంధు పథకాన్ని వర్తింపజేసింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే చేయించి సర్వే నంబర్ల ఆధారంగా పరిశీలించారు. దీంతో జిల్లాలో 6,869 ఎకరాలు సాగుకు యోగ్యం కావని అధికారులు గుర్తించారు. వీటికి రైతు భరోసా నిలిపివేసింది.

మెదక్ జిల్లా కౌడిపల్లిలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న మండల వ్యవసాయాధికారి స్వప్నాజాదవ్

## అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు

### కౌడిపల్లి మండల వ్యవసాయాధికారి స్వప్నాజాదవ్

కౌడిపల్లి, ఫిబ్రవరి 3: ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవని మెదక్ జిల్లా కౌడిపల్లి మండల వ్యవసాయాధికారి స్వప్నాజాదవ్ తెలిపారు. సోమవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో వచ్చిన 'దుకాణానికో బిల్లు.. రకానికో ధర' అనే శీర్షికతో వచ్చిన కథనానికి ఏవో స్పందించారు. కౌడిపల్లిలో అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్న ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. అధిక ధరలకు అమ్మిన కౌడిపల్లిలోని ఆగ్రోస్ రైతు సేవాకేంద్రం, భాగ్యలక్ష్మి, డీసీఎంఎస్ దుకాణాల యజమానులకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. అధిక ధరలకు విక్రయించి అక్రమాలకు పాల్పడినట్లు రుజువైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఏడాది తిరగకముందే దెబ్బతిన్న రోడ్డు

- ఇబ్బందుల్లో వాహనదారులు, ప్రయాణికులు

వడ్డి-గుంజోట్టి గ్రామ శివారులో దెబ్బతిని గుంతలు పడిన ఆర్అండ్‌బీ రోడ్డు

జహీరాబాద్, ఫిబ్రవరి 3: ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం... పర్యవేక్షణ కొరవడడం.. కాంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా పనులు చేయడంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన రోడ్డు తక్కువ సమయంలోనే దెబ్బతిన్నది. సంగారెడ్డి జల్లా జహీరాబాద్ మండలంలోని ముంగి ఆదిలక్ష్మి ఆశ్రమ సమీపం గుండా రాంతీర్థం, గుంజోట్టి, వడ్డి, శంశోల్లాపూర్ గ్రామాల మీదుగా కర్ణాటక సరిహద్దు వరకు వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డుపై నిత్యం అనేక మంది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ రోడ్డు దెబ్బతినడంతో రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు తప్పడం లేదు. రూ. 1.43 కోట్లతో ఎనిమిది నెలల క్రితం గుంజోట్టి-వడ్డి గ్రామాల శివారుతో పాటు దెబ్బతిన్న పలుచోట్ల 3.6 కిలోమీటర్ల మేర రోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. రోడ్డు నిర్మాణ దశలో సంబంధిత అధికారుల పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో పనులు నాసిరకంగా చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో కొద్దిరోజుల్లోనే రోడ్డు దెబ్బతిన్నది. ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలతో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. నాసిరకంగా పనులు చేపట్టడంతోనే ఏడాది తిరగకముందే రోడ్డు దెబ్బతిన్నట్లు వాహనదారులు ఆరోపిస్తున్నారు. జిల్లా అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ప్రజావాణికి 63 అర్జీలు

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 3: ప్రజావాణి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి 63 అర్జీలు అందాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు తమ ఫిర్యాధులను అధికారులకు అందజేసి వాటిని సకాలంలో పరిష్కరించాలని కోరారు. ఆయా అర్జీలను స్వీకరించిన కలెక్టర్ వల్లూరు క్రాంతి, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి వాటిని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో పద్మజారాణి, ఆర్డీవో రవీందర్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# గ్రామకంఠం భూమి కబ్జా

- సంగారెడ్డి జిల్లా కంది మండలం బేగంపేట్‌లో వాటర్ ట్యాంక్ స్థలంలో ఇంటి నిర్మాణానికి యత్నం
- అధికార పార్టీ నాయకుల అండదండలతో భూకబ్జా
- చర్యలు తీసుకోవాలని అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు

సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, గ్రామస్తులు

కంది, ఫిబ్రవరి 3: సంగారెడ్డి జిల్లా కంది మండలం బేగంపేట గ్రామ కంఠం భూమిని కొందరు కబ్జా చేశారు. గ్రామంలోని వాటర్ ట్యాంక్ స్థలంలో అక్రమంగా గుంతలు తవ్వి ఇంటిని నిర్మించే ప్రయత్నం చేస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలతో తప్పుడు పత్రాలు సృష్టించి భూకబ్జాకు ప్రయత్నిస్తున్నారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని బేగంపేట గ్రామస్తులు డిమాండ్ చేశారు. సోమవారం బీఆర్ఎస్ నాయకుడు సాయిగౌడ్ సమక్షంలో గ్రామస్తులు కలెక్టరేట్‌లో అధికారులకు ఫిర్యాదు చేశారు. కబ్జాకు గురవుతున్న వాటర్ ట్యాంక్ స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని, తప్పుడు పత్రాలు సృష్టించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌ను కోరారు. ఈ సందర్భంగా సాయిగౌడ్ మాట్లాడుతూ.. బేగంపేట పంచాయతీ పరిధిలో వాటర్ ట్యాంక్ స్థలం ఉందని, ఈ స్థలం వాటర్ ట్యాంక్‌కు చెందినదేనని, పంచాయతీ సమావేశంలో తీర్మానం కూడా చేశామన్నారు. కొందరూ ఆ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారని, అధికారులు వెంటనే స్పందించి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. గతంలో కూడా భూకబ్జా విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొచ్చామని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారిలో బేగంపేట గ్రామస్తులు శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్, రవి, శేఖర్, మల్లేశ్ ఉన్నారు.